


# పార్లమెంట్‌లో పకపకలు!

అధికార పక్ష సభ్యులు, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాదోపవాదాలతోనూ, ప్రతిపక్షాల వారి వాకౌట్లతోనూ హడావుడిగా వుండే పార్లమెంటు సమావేశాలలో అప్పుడప్పుడు చక్కని చతురోక్తులు, ఛలోక్తులు కూడా వినిపిస్తుంటాయి. ఈ విధంగా రాజకీయ ఛలోక్తులు విసరడంలో ఆచార్య కృపలానీ, హరేన్ ముఖర్జీ, పిలూ మోడీ మొదలైనవారు దిట్టలు.

లోక్‌సభ మాజీ స్పీకర్ సర్దార్ హుకుంసింగ్ కూడా అటువంటి ప్రముఖులలో ఒకరు. ఒకసారి రైల్వే నిర్వహణపై చర్చ సాగుతోంది. కాపలాలేని లెవెల్ క్రాసింగ్‌ల గూర్చి ఆందోళన వ్యక్తపరుస్తూ ఒక ప్రతిపక్ష సభ్యుడు ప్రసంగిస్తున్నాడు. కానీ తా నెంతగా ఆందోళన కనపరుస్తున్నా సదరు రైల్వే శాఖ మంత్రి పట్టించుకోనందుకు విసిగిపోయిన ఆ సభ్యుడు శ్రీ హుకుంసింగ్ వైపు తిరిగి "చూస్తున్నారుగా ప్రభుత్వం వారి ధోరణిని, మీరైనా నాకు సహాయం చేయండి" అంటూ విన్నవించుకున్నాడు. దానికి శ్రీ హుకుంసింగ్ చిరునవ్వు నవ్వుతూ అన్నారు:

"దానికేముంది, నాకు చేతనయిన సహాయం చేయడానికి నేనెప్పుడూ సిద్ధమే. నేనే స్వయంగా ఒక లెవెల్ క్రాసింగ్ వద్ద కాపలా వుంటాను. కానీ మిగిలిన లెవెల్ క్రాసింగ్‌లు అలాగే వుంటాయి కదా!" వెంటనే ఆ సభ్యునితో సహా అందరూ నవ్వారు.

ప్రముఖ పార్లమెంటేరియన్ పిలూ మోడీ కూడా మంచి హాస్యప్రియులు. ఒకసారి ఆయన అమెరికా పర్యటన చేసి వచ్చి పార్లమెంటులో అమెరికా దేశపు గొప్పతనం గురించి పదే పదే చెప్పసాగారు. కానీ అది కేరళకు చెందిన ఒక సభ్యునికి నచ్చలేదు.

"నేను కూడా అమెరికా వెళ్ళానుకానీ నాకేం అంత గొప్పగా కనిపించలేదు. మీకు తెలుసో లేదో మొన్నోసారి న్యూయార్క్‌కి వెళ్ళినప్పుడు నా మిత్రులు కొందరు రాత్రిపూట ఒంటరిగా బైట తిరగవద్దని చెప్పారు. దానినిబట్టే అక్కడి పరిస్థితులెలా వున్నాయో ఊహించుకోవచ్చు" అన్నాడు వ్యంగ్యంగా. వెంటనే పిలూమోడీ:

"పాపం అమెరికా ప్రజల బాగుకోరే శ్రేయోభిలాషులు ఎవరో తమరిని రాత్రిళ్ళు బయటికి పోవద్దని హెచ్చరించి వుంటారు" అని నవ్వుతూ అన్నప్పుడు సభంతా ఒక్కసారి ఘొల్లుమంది.

ఒకసారి డాక్టర్ రామ్ మనోహర్ లోహియా విపరీతంగా పెరిగిపోతున్న ధరలవల్ల గృహిణులు పడే పాట్లు గురించి కళ్ళకు కట్టినట్లుగా ప్రసంగిస్తున్నారు. అధికార పక్ష సభ్యురాలైన ఒకావిడకు అది నచ్చలేదు. అందుకే వెటకారం చేస్తూ "లోహియాగారు ఇంకా వివాహం చేసుకోకుండానే గృహిణుల సమస్యలు వల్లిస్తున్నారు" అన్నది.

"ఏదీ గౌరవ సభ్యురాలు నాకా ఛాన్స్ కలుగనివ్వలేదు కదా!" అని లోహియా అనగానే సభ్యులంతా బిగ్గరగా నవ్వేశారు.

వరకట్నం సమస్య పట్ల పార్లమెంటులో చర్చ జరుగుతున్నప్పుడు ఒక ప్రతిపక్ష సభ్యుడు లేచి-

"పార్లమెంటు సభ్యులు కూడా వారి కుమారుల వివాహాలకు రహస్యంగా కట్నం స్వీకరిస్తున్నారు" అని ఒక ఆరోపణ చేశాడు. ఈ ఆరోపణ వల్ల సభ్యులు తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. సభలో ఉద్రిక్తత నెలకొన్నది. అప్పుడు అటల్ బిహారీ వాజ్‌పాయ్ లేచి-

"నా కుమారుడి వివాహానికి నేను కట్నం పుచ్చుకున్నందుకు గౌరవ సభ్యులను క్షమించమని వేడుకుంటున్నాను" అన్నారు.

వెంటనే వాజ్‌పాయ్‌గారు బ్రహ్మచారి అనే విషయం గుర్తుకు వచ్చిన సభ్యులంతా ఒక్కసారిగా నవ్వేశారు.

సేకరణ : హిమజారమణ

## తెల్లారింది

గంగాధరం బ్రహ్మచారి. ఉద్యోగం చేస్తున్నాడు. ఆ ఊళ్ళో కొన్ని సంబంధాలున్నాయని, నచ్చిన అమ్మాయిని చేసుకోమని మిత్రులు- హితైషులు వెంటబడ్డారు. కాని, గంగాధరం కొన్ని రోజులు ఇలాగే ఎంజాయ్ చేయాలని మౌనంగా వుండిపోయాడు. తను బాడుగకున్న ఇంటివాళ్ళ అమ్మాయి కూడా వివాహం కాకుండా వుందన్న సంగతి తెలుసు, వాళ్ళూ ప్రయత్నించినా ఇప్పట్లో వద్దన్నాడు. వాళ్ళూ, తనూ వుండేది ఒకే కాంపౌండ్‌లోనే!

గంగాధరం పెళ్ళి చేసుకోడానికి కొత్త ముందూ వెనకాడినా కంటికి నదరుగా వుండే అమ్మాయిని చూసి ఉవ్విళ్ళూరడం- తీరికగా ఏమోమో ఊహించుకోవడం అలవాటు. వయసుచేసే చిలిపి చేష్ట అనుకొని సమర్థించుకొనేవాడు.

ఇంటివాళ్ళ అమ్మాయి శారద కనిపిస్తే అవసరం లేకున్నా పలుకరించేవాడు. కాస్సేపు హాస్యం కొట్టేవాడు. ఆ అమ్మాయీ నిస్సంకోచంగా మాట్లాడేది. అప్పుడప్పుడూ చనువుగానూ మాట్లాడేది. అటువంటప్పుడే గంగాధరం ఆ అమ్మాయిపట్ల ఏవేవో ఊహించుకునేవాడు.

ఓ రోజు ఇంటివాళ్ళంతా శారదను మాత్రం ఇంట్లో వుంచి, వాళ్ళంతా ఏదో ఊరికి వెళ్ళిపోయారు. గంగాధరం తిరిగి తిరిగి రాత్రి తొమ్మిది గంటలకు రూమ్ చేరుకున్నాడు. ఇంట్లో శారద ఒక్కతే వుండడం గమనించి, వెళ్ళి పలుకరించి కాస్సేపు మాట్లాడాడు.

తన గదిలోకి వచ్చి ఓ వారపత్రిక చదువుతుంటే దాంట్లో సమయానికన్నట్లు ఓ శృంగార కథ కంట బడింది. 'సకుటుంబ పత్రిక అంటారు. మధ్యలో ఈ కథలేమిట్రో!' అనుకున్నాడు. తనలాంటి బ్రహ్మచారులకూ ఇబ్బందే కదా అనుకున్నాడు. అయినా, కథ చదివాడు. అందులో హీరో హీరోయిన్‌లుగా తనను, శారదను ఊహించుకోసాగాడు. సమయం పదకొండయింది. లేచివెళ్ళి తలుపులేసి వచ్చి పడుకుంటూ శారద ఈ రాత్రి వచ్చి తలుపు తట్టితే...? ఆనందంగా ఆలోచించాడు. 'తమిద్దరేగా ఇప్పుడున్నది' సంబరపడ్డాడు. కళ్ళు మూసుకున్నాడు.

తలుపు శబ్దం కాగానే ఉలిక్కిపడి "ఎవరూ? ఏం కావాలి?" అరిచాడు. "నేనే శారదని". అనుకున్నట్టే వచ్చేసిందని అనుకుంటూ తలుపు తెరిచాడు. "ఇంకా నిద్రేమిటి? దొడ్లో నల్లాలో నీళ్ళొస్తున్నాయి. పట్టుకోండి. తెల్లారింది" అంది సహజంగా!

గంగాధరం "అలాగే" అన్నాడు ఏడుపు నవ్వుతో.

— వినమూర్తి

వినాయకచవితి కాలమ్ దాటని కథల పోటీలో రు.50 మూడవ బహుమతి గెలుపొందిన రచన

## స్పాంజ్

విపరీతమైన దాహంగా వుంటోందని, ఎన్ని నీళ్ళు త్రాగినా తీరడం లేదని డాక్టర్ దగ్గరికొచ్చిన ఓ పేషెంట్‌ని చెక్ చేశాడు డాక్టర్.

"ఇటీవల మీకేదైనా ఆపరేషన్ అయిందా?" అడిగాడు డాక్టర్.

"ఆ! అయింది డాక్టర్. దానికీ,దీనికీ ఏమైనా సంబంధముందంటారా?" అడిగాడు పేషెంట్.

"బ్రహ్మాండంగా వుంది. నీకు ఆపరేషన్ చేసిన డాక్టర్ ఎవరోగాని లోపల ఓ స్పాంజ్ ముక్కవుంచి కుట్టేశాడు" చెప్పాడు డాక్టర్.





ఆంధ్ర సచిత్ర వారపత్రిక 6-10-89